E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 03-06-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:151|| పేజీలు–6
www.ekaburu.com

ఐదుగురు జడ్జీల
ప్రమాణ స్వీకారం
ఐదుగురు జడ్జీల ప్రమాణ స్వీకారం
సుప్రీంకోర్టులో 37కి చేరిన జడ్జీజల సంఖ్య

ఎబోలా కలవరం..
కేంద్రం కీలక అడ్వైజరీ

రైతు నుంచి మహిళ వరకు..
అభివృద్ధే లక్ష్యం

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

- ట్రిలియన్ డాలర్ తెలంగాణే లక్ష్యం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాల టార్గెట్
- ఉద్యోగ భర్తీలు నిరంతరం కొనసాగుతాయి
- అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

ఈకబురు, హైదరాబాద్: 'తెలంగాణ భూమి నైసర్గిక స్వరూపం అన్ని రకాల పంటలు పండించడానికి అనుకూల క్షేత్రం. రైతులు కొన్ని పంటలకే పరిమితం కాకుండా అన్ని రకాల పంటలు, కూరగాయలు, పండ్లు పండించి తెలంగాణ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పాలి..'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలోనే కాదు.. ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది తన స్వప్నమని చెప్పారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌స్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. '2025-26లో 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగింది. రెండున్నరేళ్ల లో ధాన్యం కొనుగోళ్లకు రూ.82,840 కోట్లు ఖర్చు చేశాం. యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 63.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.11,903 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. 10 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశాం. దేశంలో యాసంగిలో సేకరించిన మొత్తం ధాన్యంలో తెలంగాణ వాటా 60% కావడం గర్వకారణం. యాసంగిలో 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 4 లక్షల ఎకరాల్లో జొన్న సాగుతో రైతులు చరిత్ర సృష్టించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..'అని సీఎం చెప్పారు.

మిగతా 2లో

తెలంగాణ ప్రజలకు
గుడ్ న్యూస్
ప్రతి పౌరునికీ 'ఇందిరమ్మ జీవిత బీమా' ; మంత్రి పొన్నం

నేను లేకపోతే జైల్లో ఉండేవాడివి
నెతన్యాహుపై ట్రంప్ మండిపాటు
తాను జోక్యం చేసుకుని ఉండకపోతే ఇజ్రాయెల్ ప్రధాని...

కాంగ్రెస్ పాలనలో
అభివృద్ధి ఆగం
అన్ని రంగాల్లో ప్రగతి కుప్పకూలింది
వర్గాలన్నీ ప్రభుత్వంపై పోరాడుతున్నాయ్
రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కేటీఆర్ విమర్శలు

తృణమూల్‌లో
ముసలం?
50 మంది టీఎంసీ ఎమ్మెల్యేల రహస్య భేటీ!
కొద్దిమంది సీనియర్లే హాజరు
చీలిక దిశగానా...

పోరాటయోధుల కలలు
ఇంకా నెరవేరలేదు
ఒక అవినీతిపరుడు పోతే ఇంకొకరు వచ్చారు
ప్రజలు చెమటోడ్చి సాధించిన డబ్బు
కాంగ్రెస్ దర్బార్ పాలవుతోంది
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ధ్వజం

మిలియన్ మార్చ్ ను తలపించేలా
భూపోరాటం
జులై 2న ఉప్పల్ భగాయత్‌లో పెద్ద ఎత్తున భూపోరాటం చేస్తాం

- పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిస్తున్న
- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి ప్రకటన చేయకపోవటం దుర్మార్గం
- ఆగస్టు 6 లోగా ప్రొఫెసర్ జయశంకర్ గారి విగ్రహం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

ఈ-కబురు, హైదరాబాద్:
తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలం కోసం మిలియన్ మార్చ్ ను తలపించే భూ పోరాటాన్ని చేస్తామని తెలంగాణ రక్షణ సేన ఛీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై విస్పష్ట ప్రకటన చేస్తారని భావించినప్పటికీ

మిగతా 2లో

సర్‌పై అవగాహన పెంచుకోండి
అప్రమత్తంగా ఉండండి
- కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ SIRపై యాక్షన్ ప్లాన్
- SIRపై రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ
- రెండేళ్ల పాలనపై ఈ నెల 25 నుంచి 45 రోజుల పాటు సైకిళ్లపై ఇంటింటి ప్రచారం
- చిన్న పామైనా విషం కక్కుతోంది... గొడ్డలి పార్టీని పెద్ద కర్రతో కొట్టాలి
- డీఎస్సీ, నంద్యాల ఘటనల్లో అలెర్టుగా ఉండడంతో తోకముడిచారు
- ఓటర్ల జాబితాపైనా గొడ్డలి పార్టీ విషయంలో అప్రమత్తత అవసరం
- నాకు అనుచరులు వద్దు... పార్టీకి నాయకులు కావాలి

02

సీఎం పర్యటనతో మారనున్న
పాలమూరు ప్రాజెక్టుల స్వరూపం
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
ఈ-కబురు, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల స్వరూపాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇకపై తెలంగాణలోనూ..
జనసేన పోటీ
పవన్ కీలక ప్రకటన
- బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదు
- సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్
- తాను తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన తీరునే తప్పుపట్టానని వెల్లడి
- అధికారంపై ఆశ లేదు, సమాజంలో మార్పు మాత్రమే

మీ స్పందన, హైదరాబాద్
తెలంగాణ గడ్డతో తనకు రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, ఈ ప్రాంతంపై ఎనలేని ప్రేమ ఉందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. తమపై పలువురు చేస్తున్న విమర్శలు, బెదిరింపుల నేపథ్యంలో ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో తీవ్రంగా స్పందించారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావని, ఇక్కడ నీకేం పని అని కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు. దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ ఏమైనా వాళ్ల అయ్య జాగీరా? ఇలాంటి బెదిరింపులకు భయపడే

మిగతా 2లో

తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్

ప్రతి పౌరునికీ 'ఇందిరమ్మ జీవిత బీమా' ; మంత్రి పొన్నం

ఈ-కబురు, హైదరాబాద్ :

తెలంగాణ ఆవిర్భావ సందర్భంగా సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ ప్రగతిని, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

సంక్షేమ పథకాలు.. ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రంలోని ప్రతి పౌరునికి అండగా నిలిచేలా.. ' ఇందిరమ్మ జీవిత భీమా పథకం' తీసుకొచ్చామని, అలాగే రూ. 2 లక్షల పెన్షన్ల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించామని మంత్రి తెలిపారు. నిరుపేదల సొంతింటి కలనెరవేర్చేందుకు మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని, తాజాగా రెండో దశను సీఎం రేవంత్ ఆసిఫాబాద్‌లో ప్రారంభించారని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సత్ఫలితాలనిస్తున్నాయన్నారు.

వ్యవసాయం.. పర్యావరణం

జిల్లాలో సన్న బియ్యం కొరతను అధిగమించేందుకు రైతుల సన్నరకాలు పండించేలా విత్తనాల స్థాయి నుంచే అవగాహన కల్పిస్తామన్నారు. నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభమైందని, రైతులు దీని వైపు మొగ్గు చూపేలా ప్రణాళికలు ఉన్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామగ్రామాన మొక్కలు నాటేలా ప్రత్యేక కమిటీలు వేస్తున్నామని, కాలువలు

విద్య, ఉపాధి, రోడ్డు భద్రత

జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు కిట్లు అందిస్తామని, బడి బాటలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నిరుద్యోగుల కోసం ఇప్పటికే ఉద్యోగాల భర్తీ చేపట్టామని, త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు వస్తాయని భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ' అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లలో పాడైపోయిన వాహనాలను ఉంచి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

రైతు నుంచి మహిళ వరకు.. అభివృద్ధే లక్ష్యం

మొదటి పేజి తరువాయిరూ.

60 వేల కోట్ల భూములు స్వాధీనం

'రాష్ట్రంలో ప్రజలు రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఆదరాభిమానాలు చూపడం మాకు ఎనలేని శక్తిని ఇచ్చింది. మేం పాలకులుగా కాకుండా సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. క్యూర్ ఏరియాలో ప్రభుత్వ భూములు, చెరువుల్లో కబ్జాలను తొలగించడం ద్వారా రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా భూములను హైడ్రా స్వాధీనం చేసుకుంది. మెట్రో రైలు కొనుగోలు చేసి ప్రజల ఆస్తిగా మార్చాం. ఫేజ్-1 కింద మూసీ ప్రక్షాళన ప్రారంభించాం. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. త్వరలో వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాల ఏర్పాటు పనులు ప్రారంభిస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడానికి రూ.లక్ష కోట్ల జీరో వడ్డీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే రూ.60 వేల కోట్ల రుణాలను పంపిణీ చేశాం. రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. కొత్తగా ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు 8 వేల స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశాం..'అని ముఖ్యమంత్రి తెలిపారు.

మహారాష్ట్ర సీఎంకు ఏడాదిగా లేఖలు..

'జలయజ్ఞం ప్రాజెక్టులు, 2014-15 తర్వాత చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. గత ప్రభుత్వం రూ. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పునరుద్ధరణ మొదలు పెట్టాం. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించి తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించడానికి మహారాష్ట్ర సమ్మతి కోరేందుకు ఆ రాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ కోసం గతేడాదిగా లేఖలు రాస్తున్నా. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజనీరింగ్ శాఖలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, అటవీ, విద్యా శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వస్తుంది. నోటిఫికేషన్ల జారీ నిరంతరం జరుగుతుంది.

విద్యా రంగంలో సంస్కరణలు

సర్కారీ విద్యలో సంస్కరణలతో కేంద్రం విడుదల చేసిన ఫెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ మంచి స్థానాన్ని పొందింది. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు 65 ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా పునర్ వ్యవస్థీకరించాం. స్కిల్స్ యూనివర్సిటీలో 1,190 మంది విద్యార్థులు కోర్సులు పూర్తి చేయగా, 838 మంది మైక్రోసాఫ్ట్, ఫ్లిప్‌కార్ట్, టెక్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, ఏఐజీ హాస్పిటల్స్, అపోలో హాస్పిటల్స్ వంటి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. ఈ ఏడాది మరో 2,769 బడుల్లో ప్రీ ప్రైమరీ విద్య ప్రవేశపెట్టబోతున్నాం. ఈ ఏడాది అన్ని ప్రభుత్వ బడులు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కాలేజీలకు విస్తరిస్తున్నాం..'అని రేవంత్ వెల్లడించారు.

గ్రేహౌండ్స్‌కు గ్యాలెంటరీ అవార్డులు

విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్యాలెంటరీ అవార్డులు ప్రదానం చేశారు. విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకూ పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో గ్రేహౌండ్స్ విభాగం ఆర్ఐటి.మహేశ్, ఎస్ఐ షేక్ నాగుల్ మీరా, హెచ్‌సీ కె.ఆదినారాయణ, ఏఆర్ఎస్ఐ కె.అశోక్, పీసీలు ఆర్.సునీల్‌కుమార్, ఎం.కళ్యాణ్‌కుమార్, జి.శ్రీధర్, సీహెచ్ రవీంద్రబాబు, రాథోడ్ రమేశ్, కె.సందీప్‌కుమార్, ఎం.కార్తీక్, వి.మధు, సీహెచ్ సంపత్, ఎస్ఐబీ ఏఆర్ఎస్ టి.మహేందర్ రావు, ఇంటిలిజెన్స్ హెచ్‌సీ బి.శివకుమార్, పంజాగుట్ట ట్రాఫిక్ పీసీ బండికింది శ్రవణ్‌కుమార్ ఉన్నారు. 2018 మార్చి 2న ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లోని పూజారి కాంకేర్‌లో నక్సల్స్‌తో జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడైన బి.సుశీల్‌కుమార్ తరపున అతడి సతీమణి బి.సుష్మకుగ్యాలెంటరీ పురస్కారాన్ని సీఎం అందజేశారు. కాగా కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, సిద్దిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గోవర్ధన్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్, హనుమకొండలోని గట్ల నార్సింగాపూర్ మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా మణికొండ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. నిరంజన్ ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.

సీఎం ప్రసంగానికి ఎండ దెబ్బ!

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తొలుత గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద సీఎం నివాళులు అర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. అయితే కొద్ది సేపటి తర్వాత ఎండ తీవ్రతను ప్రస్తావించిన సీఎం.. తన ప్రసంగాన్ని పూర్తిగా చదవకుండా ముగిస్తున్నట్టు ప్రకటించారు. రాతపూర్వకంగా ఇచ్చిన పూర్తి ప్రసంగాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మీడియాకు సూచించారు.

13 నెలల్లోనే 1.2 లక్షల ఇళ్లు

'రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభించి 13 నెలల్లోనే లక్షా 20 వేల ఇళ్లను పూర్తి చేశాం. సెప్టెంబర్ 17 నాటికి మిగతా 2 లక్షల ఇళ్లూ పూర్తి చేస్తాం. రెండో విడతగా క్యూర్ పరిధిలో లక్ష, మిగిలిన ప్రాంతాల్లో 2.5 లక్షలు కలిపి మొత్తం 3.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లనూ రెండో విడతలో పూర్తి చేయాలని నిర్ణయించాం. 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 3.38 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. స్కిల్డ్ వర్కర్లకు 25.9 శాతం, అన్ స్కిల్డ్ వర్కర్లకు 34.95 శాతం కనీస వేతనాలు పెంచాం. తెలంగాణ పోరాట యోధులను గుర్తించడానికి కమిటీని నియమించాం. త్వరలో ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అమలు చేయనున్నాం. రాష్ట్రాన్ని 2034 నాటికి ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్ ప్రకటించాం. మీ అందరి సహకారం, ఆశీర్వాదంతో ఈ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఈ ఆర్థికాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..'అని సీఎం పిలుపునిచ్చారు.

ఇకపై తెలంగాణలోనూ.. జనసేన పోటీ

మొదటి పేజి తరువాయి

వ్యక్తిని నేను కాదు," అని తీవ్ర ఆవేశం తో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో తనను తిరగనివ్వబోమని బెదిరించినప్పుడు, తన 'వారాహి' వాహనానికి అనుమతులు ఇచ్చి అండగా నిలబడింది తెలంగాణ సమాజమేనని ఆయన గుర్తుచేశారు. జనసేన పార్టీ పుట్టిందే తెలంగాణ నడిబొడ్డున అని, ఈ గడ్డ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనకు ఉందని స్పష్టం చేశారు.

విభజన తీరునే వ్యతిరేకించాను తప్ప

తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకం కాదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. "రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించాను. పార్లమెంట్ తలుపులు మూసి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టాను. అంతేగానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేను ఎప్పుడూ గౌరవించాను. సామాజిక తెలంగాణ రావాలన్నదే నా ఆకాంక్ష" అని వివరించారు. ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదాన్ని పట్టుకుని, ప్రెస్ క్లబ్‌లో సమావేశాలు పెట్టి మరీ తనను తిట్టే స్థాయికి కొందరు దిగజారారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్

తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. "హైదరాబాద్‌లో నేను ఒక చెరువును కబ్జా చేశానని ఆరోపిస్తున్నారు. నేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నా. ఆ భూమిని పరిశీలించండి. నేను కబ్జా చేశానని నిరూపణ అయితే, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. నాపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు" అని బహిరంగ సవాల్ విసిరారు. తనకు అధికారం మీద ఆశ లేదని, ఏపీలోనే తాను అధికారాన్ని ఆశించలేదని, అలాంటిది తెలంగాణలో ఎందుకు ఆశిస్తానని ప్రశ్నించారు. వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు.

క్షేత్రస్థాయిలోకి జనసేన.. ఇక పోటీయే

తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయాలని క్షేత్రస్థాయి నాయకులు,

కార్యకర్తలు ఎప్పటినుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. "ఇన్నాళ్లూ ఓపిక పట్టాం. ఇకపై ఊరుకునేది లేదు. నేనే స్వయంగా తెలంగాణ అంతటా పర్యటిస్తాను. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుంది. ఎవరు ఏం చేసుకుంటారో చూసుకోండి" అంటూ తన రాజకీయ ప్రత్యర్థులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. తనను విమర్శిస్తున్న నాయకులు కనీసం ఆదిలాబాద్ అడవుల్లో కూడా పర్యటించి ఉండరని, తనకు తెలంగాణలోని ప్రతి మూల తెలుసని ఆయన అన్నారు. అదేవిధంగా పొత్తులు విషయం ఇపుడు ఏమీ చెప్పలేనని పోటీ మాత్రం ఖాయం అన్నారు. తెలంగాణ కు వ్యతిరేకంగా మాట్లాడిన వారు ఇపుడు చట్ట సభల్లో ఉన్నారన్నారు. నేను తెలంగాణ లో పోటీ చేయనని మా వాళ్ళు గెలిస్తే అదే కోటి రెట్లు అన్నారు. పొత్తులు విషయం అది వారి వారి ఇష్టమని తాము మాత్రం ఖచ్చితంగా పోటీచేసే తీరతామన్నారు. పవన్ ప్రెస్ మీట్ తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశం గా మారింది. తెలంగాణ జనసేన కార్యకర్తలు మాత్రం హుషారుగా కనిపించారు.

సర్ పై అవగాహన పెంచుకోండి

అప్రమత్తంగా ఉండండి

ఈకబురు,, ఎన్టీఆర్ భవన్ :

ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(SIR) ప్రక్రియపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని.. అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం SIRపై జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జోనల్ కోఆర్డినేటర్లు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ పరిశీలకులు, బీఎల్ఏలు ఈ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. వీరికి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను ఆధారం చేసుకుని వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని SIR ప్రక్రియపై రాష్ట్రస్థాయి నేతలు మొదలుకుని..గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడమే కాకుండా.. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ...''మహానాడును వర్చువల్‌గా అద్భుతంగా నిర్వహించుకున్నాం. రెండు రోజుల మహానాడుకు 24.50 లక్షల మంది హాజరయ్యారు. వర్చువల్‌గా మహానాడు ఈ స్థాయిలో నిర్వహించుకోవడం సాధ్యమా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ... సక్సెస్ చేసుకోగలిగాం. ఇప్పుడు పార్టీ యంత్రాంగంపై అతి పెద్ద కీలక బాధ్యత ఉంది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా SIR ప్రక్రియ మొదలవుతోంది. ప్రతీ 2025 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని SIR ప్రక్రియను చేపడుతున్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారు. ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పరిపూర్ణంగా పూర్తి కావాలి. అవసరమైతే మూడోసారి కూడా ఇళ్లకు వెళ్లి ఓట్ల పరిశీలన జరపాలి. బీఎల్ఓలతో పాటు.. మన పార్టీకి చెందిన బీఎల్ఏలు కూడా వెళ్లాలి. SIRను అందరూ సీరియస్‌గా తీసుకోవాలి... ఎలాంటి నిర్లక్ష్యమూ ఉండకూడదు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకం. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలు అమలు చేయగలం... ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. పార్టీ బలంగా ఉంటే... ప్రభుత్వం మరింత బలంగా ఉంటుంది. SIRపై ప్రతీ రోజూ మానిటర్ చేస్తాం. మన ఓట్లు ఉన్నాయా..? లేవా..? అనేది నిరంతరం చూసుకోవాలి. ఏపీకి చెందిన స్థానికులు వివిధ రకాల కారణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్తారు. వారి ఓట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వివిధ ప్రాంతాల్లో ఉన్నవాళ్లు పెద్ద ఎత్తున వచ్చి ఓట్లేయడం వల్లే మొన్నటి ఎన్నికల్లో కూటమికి 164 సీట్లు వచ్చాయి."అని చంద్రబాబు స్పష్టం చేశారు.

కూటమి పార్టీల సమన్వయం ముఖ్యం

"SIR ప్రక్రియ పర్యవేక్షణలో కూటమి పార్టీలను కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. ఎన్నికలప్పుడే మిత్రపక్షాలతో కలుస్తాం... మిగిలిన రోజుల్లో పట్టించుకోం అంటే కుదరదు. ప్రభుత్వంలోనే కాదు.. అన్ని కార్యక్రమాల్లోనూ జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలి. నా రాజకీయ చరిత్రలో 2024 ఎన్నికల్లో సాధించినటు వంటి ఘన విజయం ఎప్పుడూ చూడలేదు. కొత్త వారికి టిక్కెట్లు ఇచ్చినా.. కూటమి పార్టీ అభ్యర్థి అనగానే ప్రజలు, కార్యకర్తలు ఓటేశారు. పార్టీల మధ్య సమన్వయానికి SIR మొదటి టెస్ట్. చాలా మంది అనుచరులను కోరుకుంటారు... కానీ నేను నాయకులను కోరుకుంటాను. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే పార్టీకి బలం పెరుగుతుంది. 2024 ఎన్నికల ముందు పట్టభద్రుల ఎమ్మెల్సీలు గెలిచాం. పూర్తిస్థాయిలో గ్రౌండ్ వర్క్.. టెక్నికల్ వర్క్ చేసి అద్భుత విజయాన్ని నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించాం. గ్రాడ్యుయేట్ల ఎన్నికల్లో ఒకప్పుడు పోటీ చేసేవాళ్లం కాదు. కానీ నాడు ఆ ఎన్నికల్లో పోటీ చేశాం..గెలిచాం.. అదీ మన నెట్ వర్క్ గొప్పదనం. SIR విషయంలోనూ అదే స్థాయిలో కష్టపడి పని చేయాలి. పార్టీలో వివిధ కీలక అంశాలపై చర్చలు జరగాలి.. కార్యకర్తలు చర్చల్లో భాగస్వామ్యం కావాలి. అధికార ఫలితాలు కార్యకర్తలకు అందించాలి. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు ఉండకపోవచ్చు. అయినా వారిని కూడా కలుపుకుని వెళ్లాలి. 2024 ఎన్నికలకంటే ఎక్కువగా మిత్రపక్షాలతో పని చేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నేతా, ప్రతి కార్యకర్తా పాటించాల్సిందే. SIRపై మూడు పార్టీలతో త్వరలో కోఆర్డినేషన్ కమిటీ కూడా వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో ఓ ఎన్డీఏ సమావేశం నిర్వహించుకుంటాం."అని టీడీపీ అధినేత వెల్లడించారు.

మిలియన్ మార్చ్ ను తలపించేలా

భూపోరాటం

మొదటి పేజి తరువాయి

మరోసారి మోసం చేశారన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటంతో సిద్ధించిన తెలంగాణలో వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం 12 ఏళ్లైనా హైదరాబాద్ లో ఏర్పాటు చేసుకోకపోవడం అన్యాయమన్నారు. ఆగస్ట్ 6 లోపు జయశంకర్ సార్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి కవిత అల్టిమేటం జారీ చేశారు.

మిలియన్ మార్చ్ తరహా భూపోరాటం

ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగానైనా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిస్తారని భావించినప్పటికీ మళ్లీ మోసం చేశారని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం అ అంశాలను ప్రస్తావించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కేకే కమిటీ విధి విధానాలను కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై

ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జులై 2న ఉప్పల్ భగాయత్ వేదికగా అతి పెద్ద 'భూపోరాటం' చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేదని, ఇది తెలంగాణ అస్తిత్వం, ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటమని స్పష్టం చేశారు. ఈ మహా సంగ్రామానికి రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, పత్రికా మిత్రులతో పాటు ప్రజలు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఊరికి ఒక్కరైనా సద్ది కట్టుకొని తరలిరావాలని కోరారు. 'మిలియన్ మార్చ్' ను గుర్తు చేసే విధంగా ఈ భూపోరాట ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు.

ఆగస్ట్ 6 లోగా జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలి

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని 12 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోకపోవడం అత్యంత అన్యాయమైన విషయమని కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసి, మలిదశ పోరాటానికి దిక్సూచిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని అన్నారు. తెలంగాణ జాగృతి తరపున ఇప్పటికే నాలుగు జిల్లాల్లో జయశంకర్ సార్ విగ్రహాలను ఏర్పాటు చేశామని కవిత గుర్తు చేశారు.

అయితే రాష్ట్ర రాజధానిలో ఆయన విగ్రహం ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటు కోసం తెలంగాణ జాగృతి సంస్థ 2014 నుంచే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. 2017 లో అప్పటి మున్సిపల్ శాఖకు కూడా అధికారికంగా లేఖ రాసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేన్నరేళ్లు గడుస్తున్న విగ్రహం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి అయిన ఆగస్ట్ 6 లోపు ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశామని కవిత చెప్పారు. తమకు అవకాశం ఇస్తే ఆ విగ్రహ ఏర్పాటుతో పాటు లైఫ్ టైమ్ మెయింటెనెన్స్ ను కూడా తామే చేపడతమన్నారు. తమకన్నా గొప్పగా ప్రభుత్వమే స్వయంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. కానీ ఆగస్ట్ 6 లోపు హైదరాబాద్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు, ఉద్యమకారులను మది నిండా, ఆర్తితో గుర్తు చేసుకుంటున్నామని అన్నారు. ఉద్యమంలో ఆస్తులు, ఉద్యోగాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. అలాంటి వారందరినీ అన్ని విధాలా ఆదుకొని, సముచిత రీతిలో గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి అమరవీరుడి కుటుంబానికి 1 కోటి రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఉద్యమకారులందరినీ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఎందరో ఉద్యమకారుల పోరాటం, ప్రాణ త్యాగాలతో రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. ఉద్యమ చరిత్ర ఇప్పటి పిల్లలంతా కచ్చితంగా తెలుసుకోవాలని కవిత సూచించారు. జూన్ 2 అనేది హాలిడే కాదని.. తెలంగాణ సమాజానికి ఎలాంటి వివక్ష లేకుండా, తమ సొంత యాసను తాము స్వేచ్ఛగా మాట్లాడుకునేలా చేసిన మహత్తరమైన రోజు అని చెప్పారు. మనమంతా సెకండ్ గ్రేడ్ పౌరులం కాదని నిరూపిస్తూ, ఎంతో స

నాలుగు కోట్ల తెలంగాణ
ప్రజల ఆకాంక్షలు సాకారమైన రోజు

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కొమిరిశెట్టి సాయిబాబా

ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొమిరిశెట్టి సాయిబాబా సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్షలు సాకారమైన రోజు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమని శేరిలింగంపల్లి నియోజకవవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్, తెలంగాణ ఉద్యమకారుడు కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు జాతీయ జెండాను ఆవిష్కరించారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్న సాయిబాబా... తెలంగాణ ఉద్యమకారులతో పాటు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుంటూ తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఉద్యమ నాయకత్వం, సబ్బండ వర్గాల పోరాటం కలిసి తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకున్నదని అన్నారు. ఎన్నో పోరాటలతో సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాగం జంగయ్య యాదవ్, రాగం హరి శంకర్ యాదవ్, రమేష్ గౌడ్, అంజమ్మ, రాజు ముదిరాజ్, చెన్నం రాజు, శామ్లెట్ శ్రీనివాస్, భిక్షపతి, యాదగిరి, కృష్ణారావు, లక్ష్మణ్ రావు, తాహెర్, బురాన్, అలీం, లియాకత్, వెంకట్ రెడ్డి, నారాయణ, సురేష్, బాలమణి, రాణి, మాధవి, రాజేశ్వరి తదితరులు

అమరుల త్యాగఫలం తెలంగాణ రాష్ట్రం : ముత్తోజు ఆమని

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముత్తోజు ఆమని తదితరులు

జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న ముత్తోజు ఆమని

అంజయ్య నగర్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరుల త్యాగఫలం తెలంగాణ రాష్ట్రమని అంజయ్య నగర్ డివిజన్ బిజెపి నాయకురాలు ముత్తోజు ఆమని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముత్తోజు ఆమని ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం ముత్తోజు ఆమని మాట్లాడుతూ తెలంగాణ సబండ వర్గాల పోరాటం, అమరుల ప్రాణత్యాగంతోనే దశాబ్దాల తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందన్నారు. రాష్ట్రం సాధించుకున్నా తెలంగాణ ఆశయాలను, లక్ష్యాలను మాత్రం చేరుకోలేకపోయామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో రాష్ట్రం మరింత దిగజారిందని వాపోయారు. 1400 మంది తెలంగాణ బిడ్డలు బలిదానం చేసుకుంటే గానీ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందుకు రాలేదన్నారు. తెలంగాణ బాగుపడాలంటే కేంద్ర నిధులు ఎంతో అవసరమని, 'వికసిత్ భారత్'లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. కేంద్రం నుండి నిధులు తెచ్చే, నిజాయితీగా పని చేసే బిజెపికి అవకాశమిచ్చేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తోజు మధు, గోపాల్, పరశురాం, అభిషేక్, విశాల్, సాయి తేజ, సాయి చన్ను, రాము, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

గౌలిదొడ్డిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సాయిబాబా హరి శంకర్ యాదవ్ తదితరులు

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సాయిబాబా హరి శంకర్ యాదవ్ తదితరులు

అమరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : రాగం హరిశంకర్ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నల్లగండ్ల డివిజన్ పరిధిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రాగం హరిశంకర్ యాదవ్, మాజీ వార్డు సభ్యుడు రాగం జంగయ్య యాదవ్ ల ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబాతో కలిసి జంగయ్య యాదవ్, హరిశంకర్ యాదవ్ లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం హరి శంకర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా నల్లగండ్ల డివిజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల సంకల్పం, ఐక్యత, పోరాట పటిమ ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు నాయకత్వం వహించిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సేవలను గుర్తు చేసుకుంటూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రమేష్ గౌడ్, అంజమ్మ, చెన్నం రాజు, రాజు ముదిరాజ్, లక్ష్మణ్ రావు, గద్దర్ రాజు, భిక్షపతి, శామ్లెట్ శ్రీనివాస్, శ్రీనివాస్, భీమ్ రాజ్, యాదగిరి, నారాయణ, వెంకట్ రెడ్డి, రాణి, కృష్ణారావు, రవికుమార్, సాయిరాం, సంభా, అరుణ్, శేఖర్, సంతోష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎబోలా కలవరం.. కేంద్రం కీలక అడ్వైజరీ

ఈకబురు : కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినా.. లేదా ఆ దేశాల మీదుగా వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన చేసింది. భారత్‌లో ఇప్పటివరకు ఎబోలా కేసులు ఏవీ నిర్ధరణ కాలేదని స్పష్టంచేసింది. ఎవరైనా గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశం నుంచి వచ్చినా, లేదా ఆ దేశం మీదుగా ప్రయాణించినా.. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. వెంటనే ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలని తెలిపింది. ముందస్తు సమాచారంతో.. మీ ప్రాణాలను కాపాడటంతో పాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని వెల్లడించింది. ఈ సందర్భంగా అధికారుల సాయం కోసం 1075 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని పేర్కొంది.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఆగం

ఈకబురు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి ఆగమైందని, అన్ని రంగాల్లోనూ ప్రగతి కుప్పకూలిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరిట గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఆయన తెలంగాణ తల్లికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ''బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ఒంటరిగానే పోటీ చేసింది. ఒంటరిగానే గెలిచింది. 'గెలుపుతో పొంగిపోయేది లేదు. ఓడితే కుంగిపోయేది లేదన్న' కేసీఆర్ మాటలను స్ఫూర్తిగా తీసుకుంటుంది. కేసీఆర్‌పై, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పాలనలో మోసపోని వర్గమంటూ ఏదీ లేదు. కేసీఆర్ హయాంలో సంతోషంగా సాగిన వ్యవసాయం ఇప్పుడు సంక్షోభంలో కూరుకుపోయింది. రైతుబంధు లేదు. ఎరువులు ఇచ్చేవాళ్లు లేరు. పండించిన పంట రెండు నెలలైనా కొనే దిక్కు లేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సన్నగిల్లాయి. ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే.. ముఖ్యమంత్రి రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి కృష్ణా, గోదావరి జలాలను తన గురువు చంద్రబాబుకు సంతర్పణ చేసే కార్యక్రమాలను చేస్తున్నారని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి తీరుపై 70 లక్షల మంది తెలంగాణ రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అశోక్‌నగర్‌లో నిరుద్యోగ అభ్యర్థులను, యువకులను రాహుల్‌గాంధీ మోసం చేశారు. రెండున్నరేళ్లయినా కనీసం 4,000 కొత్త ఉద్యోగాలు కూడా భర్తీ చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని.. రాహుల్‌గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పోలీసులు లేకుండా అశోక్‌నగర్ చౌరస్తాకు వచ్చి నిరుద్యోగులను కలవగలరా? ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కూడా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. ఎక్కడికక్కడ నిరసనలు తెలుపుతున్నారు. ఈరోజు తెలంగాణవ్యాప్తంగా ముక్తకంఠంతో 'కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి' అంటోంది' అని కేటీఆర్ పేర్కొన్నారు. మా పోరాటం అధికారం కోసం కాదని, కష్టపడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవడం కోసమేనని పునరుద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని, కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తంచేశారు.

సీఎం పర్యటనతో మారనున్న పాలమూరు ప్రాజెక్టుల స్వరూపం

ఈకబురు, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల స్వరూపాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 4, 5వ తేదీల్లో (రేపు, ఎల్లుండి) ఈ జిల్లా పర్యటనతో పాలమూరు ప్రాజెక్టుల స్వరూపం మారుతుందన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని జలసౌధలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల స్థితిగతులు, సీఎం పర్యటన ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్తమ్ మాట్లాడుతూ... 'ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు పాల్గొంటున్నారు. ప్రాజెక్టులన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రతి ప్రాజెక్టు కింద సాగునీటిని అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పాలమూరురంగారెడ్డి, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు ఇతర ప్రాజెక్టుల స్థితి, పురోగతిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలి. నిధుల అంచనాలు, ప్రాజెక్టుల పూర్తికి షెడ్యూల్ ప్రకటనలు ఈ పర్యటనలో ఖరారు చేస్తాం. అవసరమైన కార్యాచరణపై సీఎం పర్యటనలోనే ప్రభుత్వం అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకుంటుంది' అని పేర్కొన్నారు.

ఐదుగురు జడ్జీల ప్రమాణ స్వీకారం

ఈ-కబురు, న్యూఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానంలో కొత్తగా ఐదుగురు న్యాయమూర్తులు నియమితులయ్యారు. శీల్ నాగ్, శ్రీచంద్రశేఖర్, సంజీవ్ సచ్‌దేవా, అరుణ్ పల్లి, వి.మోహనతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. సుప్రీంకోర్టులో సీజేఐతో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరుకుంది. మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 38 కాగా, ప్రస్తుతం కేవలం ఒక్క పోస్టు మాత్రమే ఖాళీగా ఉంది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాది వి.మోహనకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని మే 27న సిఫారసు చేసింది. కేంద్ర ప్రభుత్వం మే 31న ఆమోదం తెలిపింది. సిట్టింగ్ జడ్జీలు జస్టిస్ పంకజ్ మిథాల్ ఈ ఏడాది జూన్ 16న, జస్టిస్ జె.కె.మహేశ్వరి జూన్ 28న పదవీ విరమణ చేయబోతున్నారు.

జస్టిస్ శీల్ నాగ్: 1965 జనవరి 1న జన్మించారు. 1987 అక్టోబర్‌లో అడ్వొకేట్‌గా న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టారు. 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2013 మే 23న అదే కోర్టులో పర్మినెంట్ జడ్జిగా పదోన్నతి పొందారు. 2024 మే 25న మధ్యప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, 2024 జూలై 9న పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జస్టిస్ శ్రీచంద్రశేఖర్: 1965 మే 25న జన్మించారు. 1993లో ఢిల్లీ యూనివర్సిటీ లా కాలేజీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. 2013 జనవరి 17న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2014 జూన్ 27న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 డిసెంబర్ 29 నుంచి 2023 జూలై 4 వరకు జార్ఖండ్ హైకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. 2024 జూలై 5న రాజస్తాన్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2025 సెప్టెంబర్ 5న బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా: 1964 డిసెంబర్ 26న జన్మించిన జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా 1988లో ఢిల్లీ యూనివర్సిటీ న్యాయ కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ లా డిగ్రీని పొందారు. 1988 ఆగస్టు 1న ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2011 జూలైలో ఢిల్లీ హైకోర్టు ఆయనను సీనియర్ న్యాయవాదిగా నియమించింది. 2013 ఏప్రిల్ 17న ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2015 మార్చి 18న అదే కోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2024 మే 30న మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. జస్టిస్ సచ్‌దేవా 2025 జూలై 17న మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జస్టిస్ అరుణ్ పల్లి: 1964 సెప్టెంబర్ 18న జన్మించారు. 1988లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ లా పూర్తిచేశారు. 2004 నుంచి 2007 దాకా పంజాబ్ అదనపు అడ్వొకేట్ జనరల్‌గా సేవలందించారు. 2007 ఏప్రిల్ 16న సీనియర్ న్యాయవాదిగా నియమితులయ్యారు. 2013 డిసెంబర్ 28న పంజాబ్, హరియాణా హైకోర్టు బెంచ్‌కు పదోన్నతి పొందారు. 2025 ఏప్రిల్ 16న జమ్మూ కశ్మీర్ అండ్ లద్దాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ అరుణ్ పల్లి తండ్రి, తాత పటియాలాలో న్యాయవాదులుగా పనిచేశారు.

జస్టిస్ వి.మోహన: 1966 జూన్ 27న తమిళనాడులోని చెన్నైలో జన్మించారు. 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి పట్టభద్రులయ్యారు. అప్పటి నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో గతంలో న్యాయవాద వృత్తిలో ఎవరూ లేరు. 1992 తరువాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ ఇందూ మల్హోత్రా ఛాంబర్‌లో చేరారు. సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్ ఛాంబర్‌లో కూడా ఆమె పనిచేశారు. 1996లో అడ్వకేట్-ఆన్-రికార్డ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. జస్టిస్ వి.మోహనను 2015లో సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్‌గా ఐదేళ్ల తర్వాత మహిళా జడ్జి నియమించింది. సుప్రీంకోర్టులో ఐదేళ్ల విరామం తర్వాత మహిళా న్యాయమూర్తి నియామకం కావడం విశేషం. దీంతో మహిళా న్యాయమూర్తుల సంఖ్య రెండుకు చేరుకుంది. సుప్రీంకోర్టుకు మహిళా జడ్జి నేరుగా ఎంపిక కావడం ఇది రెండోసారి. 2018లో జస్టిస్ ఇందూ మల్హోత్రా తర్వాత బార్ నుంచి నేరుగా సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన రెండో మహిళా న్యాయవాదిగా జస్టిస్ వి.మోహన రికార్డులకెక్కారు. హైకోర్టు జడ్జిగా పని చేయకుండా న్యాయవాద వృత్తి నుంచే నేరుగా సుప్రీంకోర్టు జడ్జిగా ఎంపిక కావడం గమనార్హం.

సంపద నిర్వహణ సేవల్లోకి గోద్రేజ్

హైదరాబాద్: పలు రకాల వ్యాపారాలను నిర్వహిస్తున్న గోద్రేజ్ ఇండస్ట్రీస్ కొత్తగా గోద్రేజ్ వెల్త్ పేరుతో సంపద నిర్వహణ (వెల్త్ మేనేజ్‌మెంట్) సేవల్లోకి అడుగుపెట్టింది. రాబోయే అయిదేళ్లలో 35 ప్రాంతాలకు విస్తరించి, రూ.1 లక్ష కోట్ల ఏయూఎం (నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ) సాధించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం రూ.2 కోట్ల పెట్టుబడి సామర్థ్యం ఉన్న సంపన్నులు, వ్యాపారవేత్తలు, ప్రవాసులే లక్ష్యంగా గోద్రేజ్ వెల్త్ సేవలు అందిస్తుంది. వారసత్వ ప్రణాళిక, ప్రైవేట్ మార్కెట్, అంతర్జాతీయ పెట్టుబడులు, పోర్ట్‌ఫోలియో సమతౌల్యం వంటి సేవలను డిజిటల్ విధానంలో అందుబాటులోకి తెస్తున్నట్లు గోద్రేజ్ గ్రూప్ ఛైర్‌పర్సన్ (డిజిగ్నేట్) పిరోజ్‌షా గోద్రేజ్ పేర్కొన్నారు.

వెండి దిగుమతిపై మరిన్ని ఆంక్షలు

దిల్లీ: వెండి దిగుమతి నిబంధనలను కేంద్రం మరింత కఠినతరం చేసింది. తాజాగా పొడి, గ్రెయిన్ రూపంలో ఉన్న వెండి దిగుమతిని నిషేధిత జాబితాలోకి చేర్చింది. వెండి దిగుమతులకు తప్పనిసరిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) అనుమతి ఉండాలనీ కేంద్రం తెలిపింది. 99.9% స్వచ్ఛత వరకు వెండి ఉన్న గ్రెయిన్, పొడి, ఇతర రూపాల్లోని వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత నెలలోనే 99.9% స్వచ్ఛత ఉన్న వెండి కడ్డీల దిగుమతిని, పాక్షికంగా తయారైన అన్ని వెండి వస్తువులను నిషేధిత విభాగంలో కేంద్రం చేర్చిన సంగతి తెలిసిందే. అదే సమయంలో పెరుగుతున్న ముడి చమురు ధరల కారణంగా విదేశీ మారక నిల్వలపై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు వెండి, బంగారంపై దిగుమతి సుంకాన్ని 6% నుంచి 15 శాతానికి చేర్చిన విషయం విదితమే.

స్ప్రింగ్ ఎనర్జీ కొనుగోలు రేసులో ఆదిత్య బిర్లా గ్రూప్ ముందంజ

ADITYA BIRLA GROUP

బ్రిటన్ కంపెనీ షెల్ పీఎల్‌సీకి చెందిన భారత పునరుత్పాదక ఇంధన సంస్థ అయిన స్ప్రింగ్ ఎనర్జీ కొనుగోలు రేసులో కుమార మంగళం బిర్లా ఆధ్వర్యంలోని ఆదిత్య బిర్లా గ్రూప్ ముందంజలో ఉంది. ఆదిత్య బిర్లా రెన్యూవబుల్స్ వచ్చే కొన్నేళ్లలో 10 గిగావాట్ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. స్ప్రింగ్ ఎనర్జీని సొంతం చేసుకోవడానికి అమెరికా ప్రైవేటు ఈక్విటీ సంస్థ కేకేఆర్, యాక్టిస్‌తో పాటు ఎన్ఐఐఎఫ్, టెమాసెక్ కన్సార్షియం సైతం ఆసక్తి వ్యక్తీకరించాయి. అయితే కేకేఆర్‌ను వెనక్కి నెట్టి బిర్లా గ్రూప్ తుది దశకు చేరినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయనీ, ఇతర బిడ్డర్లూ తెరపైకి వచ్చినా ఆశ్చర్యం లేదని వారంటున్నారు.

ఆల్కెమ్ నుంచి ఒకే డోసు సెమాగ్లుటైడ్

హైదరాబాద్: మధుమేహం, స్థూలకాయం సమస్యలతో బాధపడుతున్న వారికోసం సెమాగ్లుటైడ్ ఔషధాన్ని ఒకేసారి ఉపయోగించగలిగిన సిరంజీల్లో (ఒకో డోసు ప్రీఫిల్డ్ సిరంజీలు) అందిస్తున్నట్లు ఆల్కెమ్ లేబొరేటరీస్ వెల్లడించింది. దీని ప్రారంభ డోసు ధరను రూ.350గా నిర్ణయించింది. ఈ విధానంలో సెమాగ్లుటైడ్‌ను అందిస్తున్న తొలి సంస్థ తమదేనని ఆల్కెమ్ పేర్కొంది. ఆహార నియమాలు, వ్యాయామానికి అదనంగా టైప్ 2 మధుమేహం, ఊబకాయం నియంత్రణలకు ఈ ఔషధం ప్రీఫిల్డ్ సిరంజీల తయారీ, విక్రయానికి భారత ఔషధ నియంత్రణ సంస్థ నుంచి ఆమోదం లభించినట్లు సంస్థ మంగళవారం వెల్లడించింది. ఈ సిరంజీలు రోగులకు సౌకర్యవంతంగా ఉంటాయని, అందుబాటు ధరల వల్ల ఈ చికిత్స మరింతమందికి చేరువుతుందని కంపెనీ సీఈఓ వికాస్ గుప్తా పేర్కొన్నారు.

ALKEM

పెరుగుతున్న పోటీ..: ఈ ఏడాది ప్రారంభంలో నోవో నార్డిస్క్‌కు చెందిన సెమాగ్లుటైడ్ ఉత్పత్తులకు పేటెంట్ ముగిసింది. దీంతో వేగంగా వృద్ధి చెందుతున్న స్థూలకాయ, మధుమేహ మార్కెట్లో ఫార్మా కంపెనీల మధ్య పోటీ తీవ్రమైంది. ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ సహా పలు ఇతర కంపెనీలు తమ ఔషధాలను మార్కెట్లోకి తీసుకొచ్చాయి. ఫార్మారాక్ అంచనాల ప్రకారం ప్రస్తుతం సుమారు రూ.1,500 కోట్లుగా ఉన్న భారతదేశ స్థూలకాయ ఔషధ మార్కెట్, 2030 నాటికి రూ.8,000 కోట్లకు విస్తరించే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో 40కిపైగా భారతీయ ఫార్మా కంపెనీలు 50కి పైగా బ్రాండ్లలో బరువు తగ్గించే, మధుమేహం చికిత్సకు సంబంధించిన ఔషధాన్ని ప్రవేశపెట్టనున్నాయని విశ్లేషకుల అంచనా. పోటీ పెరగడం వల్ల ధరలు మరింత దిగివస్తాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

రూ. 57,000 కోట్ల బంగారాన్ని ఆర్‌బీఐ విక్రయించిందా?

డాలర్లను కాపాడుకునేందుకే బ్లూమ్‌బర్గ్ నివేదిక

పశ్చిమాసియా సంక్షోభం వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటికి మన స్టాక్‌మార్కెట్లలో రూ.2.25 లక్షల కోట్ల విలువైన విలువైన ఈక్విటీలను విదేశీ మదుపర్లు విక్రయించి, పెట్టుబడులు పట్టుకెళ్లిపోతున్నారు. ఈ కారణాల వల్ల అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది.

ఫలితంగా రూపాయి విలువ తగ్గిపోతోంది. మన దగ్గర ఉన్న విదేశీ మారకపు ద్రవ్యం (ఫారెక్స్) నిల్వల విలువ 681.4 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇవి 728.49 బి.డా. కావడం గమనార్హం. అంటే 4 నెలల్లోనే 47 బి.డా.కు పైగా ఫారెక్స్ నిల్వలు తగ్గిపోయాయి. వీటిని కాపాడుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 6 బి.డా. (సుమారు రూ.57,000 కోట్ల) విలువైన పసిడి నిల్వలను విక్రయించినట్లు వార్తాసంస్థ బ్లూమ్‌బర్గ్ తెలిపింది.

ప్రభుత్వ చర్యలు ఇలా...

ఫారెక్స్ నిల్వలు వృథా కాకుండా చూసేందుకు, ప్రభుత్వం బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని రెట్టింపు కంటే పెంచి 15% చేసింది. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదమున్నా, చమురు మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూసేందుకు పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలనూ పెంచింది. వీటికి తోడు ఆర్‌బీఐ కూడా తన దగ్గర ఉన్న నిల్వల్లో 6 బి.డా. విలువైన పసిడిని మే 22తో ముగిసిన రెండు వారాల వ్యవధిలో విక్రయించింది. తద్వారా విదేశీ కరెన్సీ ఆస్తులకు ఈ మొత్తాన్ని జమచేసుకుంది. మన ఫారెక్స్ నిల్వల్లో విదేశీ కరెన్సీ ఆస్తులు 543.032 బి.డా. కాగా, పసిడి నిల్వలు 114.786 బి.డా. మేర ఉన్నాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారమే రెండు వారాల్లో పసిడి నిల్వల విలువ 6 బి.డా.కు పైగా తగ్గింది.

విక్రయాలు ఎందుకంటే..

దేశ ఎగుమతుల కంటే దిగుమతుల బిల్లు భారీగా పెరగడంతో, కరెంటు ఖాతా లోటు అంతకంతకూ అధికమవుతోంది. రూపాయి విలువ ఈ ఏడాదిలో 7% వరకు పతనం అయ్యేందుకు ఇది కారణమవుతోంది. అందుకే మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు, డాలర్ నిల్వలను పెంచుకుని, రూపాయిని బలోపేతం చేయడంపై ఆర్‌బీఐ దృష్టిపెట్టింది. ఈ ఏడాది మార్చిలో ఆర్‌బీఐ వద్ద 880.52 టన్నుల బంగారం నిల్వలున్నాయి. వీటిలో 77% నిల్వలు మన దేశంలోనే ఉన్నాయి. అంతకు 6 నెలల క్రితం మనదేశంలో ఉన్న పసిడి నిల్వలు 66 శాతమే కావడం గమనార్హం. మిగిలింది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ దగ్గర ఉండేది.

పబ్లిక్ ఇష్యూకు ఆంథ్రోపిక్!

అమెరికా ఎస్‌ఈసీకి దరఖాస్తు పత్రాల సమర్పణ

కృత్రిమ మేధ సంస్థ ఆంథ్రోపిక్ అమెరికా స్టాక్ మార్కెట్లో నమోదయ్యే దిశగా కీలక అడుగు వేసింది. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు అనుమతి కోరుతూ యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ)కు రహస్య పద్ధతిలో ముసాయిదా పత్రాలు సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ దరఖాస్తు పత్రాలను ఎస్ఈసీ సమీక్షించి, అనుమతులు ఇచ్చాక.. పబ్లిక్ ఇష్యూ నిర్వహణకు అవకాశం కలుగుతుందని కంపెనీ పేర్కొంది. మార్కెట్ పరిస్థితులు, ఇతరత్రా అంశాలపై ఆధారపడి, పబ్లిక్ ఇష్యూకు వెళ్తామని వివరించింది. పబ్లిక్ ఇష్యూలో జారీ చేయనున్న షేర్ల పరిమాణం, ఇష్యూ ధరల శ్రేణి లాంటి వివరాలను ఆంథ్రోపిక్ వెల్లడించలేదు. ప్రైవేటు ఫండింగ్ పద్ధతిలో 65 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6 లక్షల కోట్లు) సమీకరించినట్లు ఆంథ్రోపిక్ ప్రకటించిన కొద్ది రోజులకే, ఐపీఓకు సన్నాహాలు చోటు చేసుకోవడం గమనార్హం. తాజా నిధుల సమీకరణతో ఆంథ్రోపిక్ విలువ 965 బిలియన్ డాలర్ల (సుమారు రూ.91 లక్షల కోట్ల)కు చేరడమే కాకుండా.. వ్యవస్థాపితమైన అయిదేళ్లలోనే ప్రపంచంలో అత్యంత విలువైన అంకుర సంస్థల్లో ఒకటిగా ఆంథ్రోపిక్ నిలిచింది. కోడింగ్, కార్యాలయ అవసరాలు, వ్యక్తిగత సహాయం కోసం తమ ఏఐ సాంకేతికత ఉపయోగించే వినియోగదార్ల నుంచి, సంవత్సరానికి 47 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.50 లక్షల కోట్ల) ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు ఆంథ్రోపిక్ తెలిపింది. తాజా విలువ ప్రకారం.. మార్కెట్ విలువ, ఆదాయం రెండింటిలోనూ తన ప్రధాన పోటీ సంస్థ అయిన ఓపెన్ ఏఐ కంటే ఆంథ్రోపిక్ ముందుంది. ఓపెన్ ఏఐ మాజీ ఉన్నతోద్యోగులతో 2021లో స్థాపితమైన ఆంథ్రోపిక్, ఏఐ రంగంలో వేగంగా అగ్రగామి సంస్థల్లో ఒకటిగా ఎదిగింది.

ఐటీ షేర్లలో భారీగా కొనుగోళ్లు

లాభాల్లో ముగిసిన సూచీలు
రూ.1.97 లక్షల కోట్లు పెరిగిన సంపద
ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.8362.92 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.9589.32 కోట్లు

వరస నష్టాలకు తెరదించుతూ మంగళవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. ముఖ్యంగా ఐటీ షేర్ల జోరు ఇందుకు దోహదం చేసింది. తక్కువ స్థాయుల వద్ద బ్లూచిప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడమూ కలిసివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడం, మార్కెట్ సెంటిమెంటు బలపడటానికి తోడ్పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 17 పైసలు తగ్గి 95.36 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1% పెరిగి 96 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లూ సానుకూల ధోరణిలో ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.97 లక్షల కోట్లు పెరిగి రూ.462.67 లక్షల కోట్ల (4.86 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

నష్టాల్లో ఆరంభం.. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 73,945.20 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 74,267.34) ఆరంభమైంది. మధ్యాహ్నం వరకు అదే ఒరవడిని కొనసాగించిన సూచీ.. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చింది. చివరివరకు ఆ జోరు కొనసాగిస్తూ 382.50 పాయింట్ల లాభంతో 74,649.84 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 100.95 పాయింట్లు పెరిగి 23,483.55 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 23,229.15 వద్ద కనిష్ఠాన్ని; 23,556.95 వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.

10 మినహా మిగతావి లాభాల్లోనే..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 10 మినహా మిగతావన్నీ లాభాల్లో ముగిశాయి. లాభాల్లో ఐటీ షేర్లు ముందుండగా... అదానీ పోర్ట్స్ 1.75%, టైటన్ 1.34%, ట్రెంట్ 1.29%, ఐటీసీ 1.23%, ఎటర్నల్ 1.11%, ఏషియన్ పెయింట్స్ 1.10% పెరిగాయి. ఎన్‌టీపీసీ 2.89%, యాక్సిస్ బ్యాంక్ 1.88%, పవర్‌గ్రిడ్ 1.38%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.06%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.99% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల విషయానికొస్తే.. ఐటీ, మన్నికైన వినియోగ వస్తువులు, టెలికాం, ఎఫ్ఎమ్‌సీజీ, వాహన సూచీలు రాణించాయి. విద్యుత్, ఆర్థిక సేవలు, చమురు గ్యాస్ డీలాపడ్డాయి. బీఎస్ఈలో 2,301 కంపెనీల షేర్లు లాభాల్లో; 1,904 కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. 172 కంపెనీల షేర్ల ధరలో ఎలాంటి మార్పులేదు.

ఐటీ షేర్ల దూకుడు,... అమెరికా సాంకేతిక కంపెనీల ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు, ఆదాయ అంచనాల ప్రభావం దేశీయ ఐటీ కంపెనీల షేర్లకు సానుకూలతను తెచ్చిపెట్టింది. మంగళవారం బీఎస్ఈలో హెగ్జావేర్ టెక్నాలజీస్ 6.99%, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 6.53%, ఇన్ఫోసిస్ 5.66%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 4.08%, టెక్ మహీంద్రా 1.76%, విప్రో 1.65% పెరిగాయి. ఓయో రూ.6650 కోట్ల ఐపీఓ: పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.6,650 కోట్లు సమీకరించేందుకు ఓయో మాతృసంస్థ ప్రిజమ్‌కు సెబీ నుంచి అనుమతులు లభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పబ్లిక్ ఇష్యూ కోసం కంపెనీ విలువను 78 బిలియన్ డాలర్లుగా పరిగణించే అవకాశం ఉంది. హిందుస్థాన్ కోకకోలా హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌సీసీహెచ్)ను 2027లో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసేందుకు ఉన్న మార్గాలను అంతర్జాతీయ దిగ్గజ పానీయాల సంస్థ కోకకోలా కంపెనీ పరిశీలిస్తోంది. హెచ్‌సీసీహెచ్‌లో కొంత వాటా విక్రయించాలని సంస్థ అనుకుంటోంది. హిందుస్థాన్ కోక కోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ)కు హెచ్‌సీసీహెచ్ మాతృసంస్థ.

ఎన్‌హెచ్‌పీసీ ఓఎఫ్ఎస్‌కు 3.47 రెట్ల స్పందన

ఎన్‌హెచ్‌పీసీ ఆఫర్ ఫర్ సేల్‌కు మొదటి రోజున సంస్థాగత మదుపర్ల నుంచి 3.47 రెట్ల స్పందన లభించింది. రిటెయిల్ మదుపర్లు బుధవారం బిడ్లు దాఖలు చేయొచ్చు. ఈ షేరు కనీస ధర రూ.71.

హెచ్1బీ నియామకాలో ఎన్‌విడియా జోరు

రూ.3.71 కోట్ల వరకు వేతన ఆఫర్

అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలు భారీగా ఉద్యోగ కోతలు విధిస్తూ, కొత్త నియామకాలు విదేశీయులకు వీసా స్పాన్సర్‌షిప్‌లను తగ్గిస్తున్న వేళ.. కృత్రిమ మేధ (ఏఐ) చిప్ దిగ్గజం ఎన్‌విడియా మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ టెక్ మార్కెట్‌లో మందగమనం ఉన్నప్పటికీ, అమెరికా 'హెచ్ 1బీ' వీసా ప్రోగ్రామ్ ద్వారా విదేశీ ప్రతిభావంతులను ఎన్‌విడియా భారీ వేతన ప్యాకేజీలతో ఆకర్షిస్తోంది. ఫెడరల్ ఫైలింగ్స్ ప్రకారం.. 2026లో ఇప్పటివరకు దాదాపు 1200 హెచ్ 1బీ పొజిషన్లకు ఎన్‌విడియా సర్టిఫికేషన్ పొందింది. 2025 ఇదే సమయంలో ఈ సంఖ్య 1000 మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు, ఎన్‌విడియా చిప్‌లతో నడిచే ఏఐ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకున్న నేపథ్యంలో.. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, రీసెర్చ్ విభాగాల్లో స్పెషలైజ్డ్ ఇంజినీర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఎన్‌విడియా భారీ స్థాయిలో నియామకాలు చేపడుతోంది. వీరికి వేతన ప్యాకేజీలు కూడా భారీగా ఇస్తోంది. సీనియర్ నాయకత్వం, స్పెషలైజ్డ్ ఏఐ ఉద్యోగులకు ఇంకా ఎక్కువ వేతనం వస్తోంది. కంపెనీలో డైరెక్టర్ హోదాలో ఉన్నవారి బేస్ వేతనం మాత్రం ఏకంగా 4,88,750 డాలర్ల (దాదాపు రూ.4.64 కోట్ల) వరకు ఉంది. ప్రిన్సిపల్ సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డిస్టింగ్విష్డ్ ఏఐ ఆల్గారిథమ్ ఇంజినీర్ల వార్షిక వేతనాలు 4 లక్షల డాలర్లను మించుతున్నాయి. వెనకబడిన గూగుల్, అమెజాన్: గూగుల్ గతేడాది తొలి 5 నెలల్లో ఆమోదించిన హెచ్ 1బీ నియామకాల సంఖ్య 5100 కాగా, ఈసారి ఇదే సమయంలో 2,200కు పడిపోయింది. అమెజాన్ వీసా అప్రూవల్స్ 6100 నుంచి 4300కు తగ్గాయి. వలస విధానాలపై ప్రభుత్వ అనిశ్చితి, వ్యయ నియంత్రణల కారణంగా ప్రధాన ఐటీ కంపెనీలు విదేశీ నియామకాలను భారీగా తగ్గించుకుంటున్నాయి. ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్ 1బీ దరఖాస్తులపై లక్ష డాలర్ల (దాదాపు రూ.95 లక్షల) భారీ రుసుము విధించినప్పటికీ, ఎన్‌విడియా ఆ ఖర్చులను భరిస్తూ వీసా స్పాన్సర్‌షిప్‌లను కొనసాగిస్తోందని కంపెనీ సీఈఓ జెన్సన్ హువాంగ్ ఉద్యోగులకు స్పష్టం చేశారు. అమెరికాలో ఎంఎస్ చేసిన వారికి, లక్ష డాలర్ల వీసా రుసుం నుంచి మినహాయింపు ఉంటుంది.

వ్యక్తిగత విషయాలపై రూమర్స్..

స్పందించిన త్రిష

తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తోన్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే ఇలాంటి వార్తలపై స్పందించని త్రిష (Trisha) పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేసిన ఆమె.. దానికి ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. 'నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను' అని రాసుకొచ్చారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ.. తనపై రూమర్స్ క్రియేట్ చేస్తోన్న వారిని ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్ పెట్టారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక మే నెల ప్రారంభంలో పెట్టినట్లు నెలాఖరులోనూ త్రిష పోస్ట్ పెట్టారు. ఈ నెల మొదట్లో.. 'నాకు ఇష్టమైన మంత్ వచ్చేసింది' అని పెట్టిన ఆమె.. తాజాగా 'ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా నా ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుంది' అని కొన్ని ఫొటోలు షేర్ చేశారు. దీనికి 'మ్యాజికల్ మే..' అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే రోజు తన స్నేహితుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసుకోవడంతో ఆమె పేరు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయింది. దానితో పాటు ఆమె నటించిన 'కరుప్పు' హిట్‌గా నిలిచి రూ.348 కోట్లకు పైగా వసూళ్లు చేసింది.

రజనీ 173... పనులు చకచకా

కథానాయకుడు రజనీకాంత్ ఇప్పటికే 'జైలర్ 2'ని ముగించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరులో తెరపైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక మరోవైపు రజనీ 173వ సినిమా పూర్వ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. దీన్ని కమల్‌హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఆయన ఇటీవలే పూర్తి స్క్రిప్ట్‌ని రజనీకి వినిపించగా.. సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈక్రమంలోనే ప్రస్తుతం ఈ సినిమా కోసం చెన్నైలోని పూనమల్లి ప్రాంతంలో ఓ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు సమాచారం. ఈ పనులు పూర్తి కాగానే చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశముంది.

కనిపించని హీరోలు..

భారత్ భాగ్య విధాత ట్రైలర్ రిలీజ్

బాలీవుడ్ లేడీ స్టార్ కంగనా రనౌత్ నటిస్తోన్న లేటెస్ట్ మూవీ భారత్ భాగ్య విధాత(ది అన్‌సీన్ హీరోస్). ఈ సినిమాకు మనోజ్ తపాడియా దర్శకత్వం వహించారు. ఈ మూవీని మణికర్ణిక ఫిల్మ్స్, పరమాన్స్ క్రియేషన్స్, యునోయా ఫిల్మ్స్, ఫ్లోటింగ్ రాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధమైంది.ఈ నేపథ్యంలో భారత్ భాగ్య విధాత ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే ఈ కథ నర్సుల జీవితం ఆధారంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో కంగనా నర్సు పాత్రలో కనిపించనుంది. 26/11 టెర్రరిస్ట్ ఎటాక్ జరిగిన సమయంలో నర్సుల పోరాటం గురించే ఈ మూవీలో చూపించనున్నట్లు ట్రైలర్‌లోనే అర్థమవుతోంది. కాగా.. ఈ చిత్రంలో గిరిజా ఓక్ గాడ్‌బోలే, స్మితా తాంబే, సుహిత తట్టే, ఆశా షెలార్, ప్రియా బెర్డే, ఈషా డే, రసిక అఘూసే, అమృత నామ్‌దేవ్, ఆదిత్య మిశ్రా, జాహిద్ ఖాన్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా జూన్ 12న థియేటర్లలో సందడి చేయనుంది.

తెలంగాణలో

'పెద్ది' టికెట్ ధరల పెంపు..

ఎంతంటే?



మెగా అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పెద్ది సినిమా టికెట్ ధరల పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జూన్ 4 నుంచి 10 రోజుల పాటు సింగిల్ స్క్రీన్లలో రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 పెంచుకునేందుకు అనుమతిలిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా జూన్ 3న రాత్రి 8 గంటలకు స్పెషల్ ప్రీమియర్ షోకి అనుమతిచ్చింది. స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర గరిష్ఠంగా రూ.600 వరకూ ఉండవచ్చని పేర్కొంది. ఈ మూవీకి ఇప్పటికే ఏపీ ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అనుమతులిచ్చిన విషయం తెలిసిందే. దాంతో అడ్వాన్స్ బుకింగ్స్ ఆంధ్రప్రదేశ్‌లో జోరుగా సాగుతున్నాయి. అక్కడ సింగిల్ స్క్రీన్స్‌లో రూ.100, మల్టీప్లెక్స్‌ల్లో రూ.125 పెంచుకునేలా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ ధరలు రిలీజైన రోజు నుంచి పది రోజుల పాటు అమల్లో ఉండనున్నాయి. మరోవైపు ప్రీయమిర్స్ టికెట్ ధరను ఏకంగా రూ.600గా నిర్ణయించారు. దీంతో ఏపీలో ఇప్పటికే టికెట్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా జూన్ 4న థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే ట్రైలర్, సాంగ్స్ రిలీజ్ కాగా.. మెగా ఫ్యాన్స్ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నారు. సూపర్ హిట్ కాదు.. ఏకంగా బ్లాక్‌బస్టర్ కానుందని ఫిక్సయిపోయారు. ఈ చిత్రంలో చెర్రీ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఇక "పెద్ది" సినిమాలో ఓ రీమిక్స్ సాంగ్ ఉందంటూ ప్రచారం జోరుగా సాగింది. అదే మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన జగదేకవీరుడు అతిలోక సుందరిలోని 'అబ్బనీ తియ్యనీ దెబ్బ' పాట సినిమాలో ఉందంటూ వస్తున్న వార్తలపై దర్శకుడు బుచ్చిబాబు స్పష్టత ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఆ పాటను సినిమాలో రీమిక్స్ చేయలేదు. ఒక సన్నివేశంలో రేడియోలో వినిపించేలా ప్లాన్ చేశాం. కానీ ప్రేక్షకులు కథ నుంచి బయటకు వచ్చే ప్రమాదం ఉండటంతో దాన్ని మ్యూట్ చేసేశామని తెలిపారు.

సీఎం విజయ్ తో విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ (CM Vijay)ను హీరో విజయ్ ఆంటోనీ (Vijay Antony), 'కరుప్పు' దర్శకుడు ఆర్జే బాలాజీ (RJ Balaji) వేర్వేరుగా మంగళవారం కలిశారు. సంబంధిత ఫొటోలను పంచుకుంటూ సోషల్ మీడియాలో ఆనందం వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రి విజయ్‌తో కొంత సమయం గడిపా. ఎప్పటిలాగే ఆయన పాజిటివిటీ, ఎనర్జీని చూడడం స్ఫూర్తిదాయకం. ప్రజలకు సేవ చేస్తూ, సమాజంలో అర్థవంతమైన మార్పును తీసుకురావడానికి కావాల్సిన శక్తిని విజయ్‌కు అందించాలని భగవంతుడిని కోరుకుంటున్నా" అని విజయ్ ఆంటోనీ పేర్కొన్నారు.

"విజయ్‌ను తమిళనాడు ముఖ్యమంత్రిగా కలవడం నమ్మశక్యంగా లేదు. ఇతరులపై ఆయన చూపే ప్రేమలో ఏమాత్రం మార్పులేదు. ఎప్పటిలాగే ప్రశాంతంగా ఉన్నారు" అని ఆర్జే బాలాజీ అన్నారు. 'కరుప్పు' (Karuppu) కథను ముందుగా విజయ్‌కే చెప్పినట్టు బాలాజీ గత ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన రాజకీయాల్లోకి వెళ్లడంతో.. సినిమా చేసేందుకు ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతో సూర్యతో తెరకెక్కించానని చెప్పారు. ఈ మూవీ తెలుగులో 'వీరభద్రుడు' టైటిల్‌తో విడుదలైన సంగతి తెలిసిందే.

వెంకీ కోసం మరో స్క్రిప్ట్!

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం 47'ను పూర్తి చేసే పనిలో ఉన్నారు. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో కల్యాణ్‌రామ్‌తో కలిసి చేయనున్న మల్టీస్టారర్ సినిమాకి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది జులై లేదా ఆగస్టులో పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇవింకా పూర్తి కాకముందే తన తదుపరి చిత్రానికి సంబంధించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. వెంకీ కోసం 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఓ కథని సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనిపై నిర్మాత సురేశ్‌బాబుతో ఓ దశ చర్చలు జరిగినట్లు సమాచారం. పూర్తి స్క్రిప్ట్ సిద్ధమయ్యాక వెంకటేశ్‌కి వినిపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాతే దీనిపై తుది నిర్ణయం వెలువడే అవకాశముంది. ఇక ప్రస్తుతం చిరంజీవితో వశిష్ఠ తెరకెక్కించిన 'విశ్వంభర' నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఇది ఈ ఏడాదే తెరపైకి వచ్చే అవకాశముంది.

ఇకపై వింటేజ్ కాదు..

న్యూఏజ్ మాత్రమే!

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ చిత్రం రూపొందుతోంది. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఈ నెల 10న బాలయ్య పుట్టినరోజు సందర్భంగా ఓ ప్రత్యేక ప్రచార చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మంగళవారం ప్రకటించింది. "ఇకపై వింటేజ్ కాదు. కేవలం న్యూఏజ్ మాత్రమే. మీరు అసలు ఊహించని కొత్త బాలకృష్ణని చూడబోతున్నారు" అంటూ తన పోస్ట్‌లో తెలిపింది. ఈ సినిమా ప్రస్తుతం ముంబయిలో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. సుదీర్ఘంగా సాగనున్న ఈ షెడ్యూల్‌లో బాలయ్యపై కీలక సన్నివేశాలతో పాటు పోరాట ఘట్టాలు తెరకెక్కించనున్నారు. ఆయన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో రెండు కోణాలున్న పాత్రలో అలరించనున్నట్లు తెలుస్తోంది.

నేను లేకపోతే జైల్లో ఉండేవాడివి

ఈకబురు, వాషింగ్టన్: తాను జోక్యం చేసుకుని ఉండకపోతే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు జైల్లో ఉండేవారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఆయనకే ఫోన్‌చేసి చెప్పారు. లెబనాన్‌పై కొనసాగుతున్న సైనిక చర్యలపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరువురి మధ్య వాడీవేడి సంభాషణ జరిగిందన్న ప్రచారం నేపథ్యంలో ఈ విషయాన్ని ఆయనే 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. ''బీబీ నెతన్యాహుతో ఈరోజు మాట్లాడాను. లెబనాన్ రాజధాని బీరుట్‌పై భారీ దాడులకు వెళ్లొద్దని చెప్పాను. ఆయన విని బలగాలను వెనక్కి తెచ్చారు. థాంక్యూ బీబీ'' అని దానిలో రాశారు. (నెతన్యాహును బీబీ అని మారుపేరుతో పిలుస్తారు.) లెబనాన్‌లో కొనసాగుతున్న సైనిక చర్యల విషయంలో నెతన్యాహుపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ''నువ్వు వెర్రివాడివా? అసలు ఏం చేస్తున్నావ్? ఇప్పుడు ప్రతిఒక్కరూ మిమ్మల్ని ద్వేషిస్తున్నారు. మీ వల్లే ఇజ్రాయెల్‌ను అందరూ అసహ్యించుకుంటున్నారు'' అంటూ ఆయన గట్టిగా అరిచినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ కారణంగానే ప్రపంచవ్యాప్తంగా తమ దేశంపై వ్యతిరేకత పెరిగిందని, దీనికి నెతన్యాహు బాధ్యుడని పేర్కొన్నట్లు సమాచారం.

హెజ్‌బొల్లాతోనూ మాట్లాడినట్లు వెల్లడి

లెబనాన్‌పై దాడులు కొనసాగితే వాషింగ్టన్‌తో దౌత్య చర్యలకు అంతరాయం వాటిల్లవచ్చని ఇరాన్ హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ నేరుగా నెతన్యాహుతో మాట్లాడినట్లు తెలుస్తోంది. మధ్యవర్తుల ద్వారా తాము హెజ్‌బొల్లా నేతలతో మాట్లాడామని, ఇజ్రాయెల్‌పై అన్నిరకాల దాడులను నిలిపివేయడానికి వారు అంగీకరించారని ట్రంప్ వెల్లడించారు. ఒకదానిపై ఒకటి దాడులు చేసుకోబోవని ఇరువర్గాలు హామీ ఇచ్చాయని, అది శాశ్వతంగా నిలిచే అవకాశాలున్నాయని చెప్పారు. ఇరాన్‌తో చర్చలు వేగంగా జరుగుతున్నాయంటూ ట్రంప్ మరో పోస్ట్ చేశారు.

తృణమూల్‌లో ముసలం?

ఈకబురు, కోల్‌కతా: బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమతమవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభం ఇది.

కొద్దిమంది సీనియర్లే హాజరు

బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.

చీలిక దిశగానా...

తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుంటున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుద్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం.

స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు.

పోరాటయోధుల కలలు ఇంకా నెరవేరలేదు

ఈకబురు, ఢిల్లీ: 'తెలంగాణ కోసం ఆత్మత్యాగాలు చేసిన వారు ఆశించినంతగా.. రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే మార్పు వస్తుందని భావించిన పేదల కల ఇప్పటికీ నెరవేరలేదు. తెలంగాణలో ఒక అవినీతిపరుడు పోతే.. ఆ స్థానంలోకి మరో అవినీతిపరుడు వచ్చారు. నాయకులు రాష్ట్రాన్ని ఏటీఎంలా ఉపయోగించుకుంటున్నారు. ప్రజలు చెమట చిందించి సంపాదించిన డబ్బు కాంగ్రెస్ దర్బార్ పాలవుతోంది. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ దుష్ట సంస్కృతికి చరమగీతం పాడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేరుస్తాం. నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న దాశరథి మాటలను నిజం చేస్తాం'' అని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేర్కొన్నారు. మంగళవారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆధ్వర్యంలో దిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నబీన్ ప్రసంగిస్తూ... గత 12 ఏళ్ల పాలనలో ప్రధాని మోదీ తెలంగాణకు అందించిన ప్రయోజనాలను వివరించారు. 'సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ హైదరాబాద్, తెలంగాణలను భారత్‌లో విలీనం చేసిన దగ్గరి నుంచి 2014లో పార్లమెంటులో ప్రత్యేక తెలంగాణ బిల్లుకు సుష్మాస్వరాజ్ మద్దతు తెలపడం వరకు భాజపా అడుగడుగునా మద్దతు పలుకుతూ వచ్చింది. 1997లో కాకినాడలో నిర్వహించిన భాజపా జాతీయ కార్యవర్గ సమావేశాల్లోనూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు మద్దతిస్తూ చరిత్రాత్మక తీర్మానం చేసింది. అది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, సంస్కృతి, వైభవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి చేసిన సంకల్పం. మా పోరాటాల ద్వారా ప్రత్యేక రాష్ట్రం సాధించడంలో విజయం సాధించినందుకు సంతోషిస్తున్నాం. కాంగ్రెస్ మాత్రం 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయడానికి కాల్పులు జరిపి ఎంతోమంది యువకులను పొట్టనబెట్టుకొంది. 2009 డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని చెప్పి వెనకడుగు వేయడంతో ఎంతోమంది బలిదానాలు చేయాల్సి వచ్చింది. తెలంగాణను వ్యతిరేకించిన వారు, అమరవీరులకు అండగా నిలవని వారు ఇప్పుడు అధికారంలో ఉన్నారు. మేం రాబోయే రోజుల్లో కచ్చితంగా ప్రజల అభివృద్ధి ఆకాంక్షలను పూర్తి చేస్తాం. 2047కల్లా వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే తెలంగాణనూ సంపూర్ణంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది'' అని నబీన్ పేర్కొన్నారు.

'కిక్'ఎక్కించే సమరం

తొలిసారి మూడు దేశాల్లో...

ఇప్పటి వరకు 22 సార్లు ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగింది. 1930లో ఉరుగ్వే తొలి ప్రపంచకప్ టోర్నీకి ఆతిథ్యమిచ్చింది. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1942, 1946లలో ప్రపంచకప్‌ను నిర్వహించలేదు. 1998 వరకు జరిగిన ప్రపంచకప్ టోర్నీలకు ఒక దేశం వేదికగా జరిగాయి. 2002లో తొలిసారి దక్షిణ కొరియా–జపాన్ దేశాలు సంయుక్తంగా ప్రపంచకప్‌ను నిర్వహించాయి. 2026 ప్రపంచకప్ టోర్నీకి మొదటిసారి (అమెరికా, మెక్సికో, కెనడా) మూడు దేశాలు కలిసి ఆతిథ్యమిస్తున్నాయి. 2030 ప్రపంచకప్ కూడా మూడు దేశాల్లో (మొరాకో, పోర్చుగల్, స్పెయిన్) జరగనుంది. ఇక 2034 ప్రపంచకప్ టోర్నీ ఆతిథ్య హక్కులు సౌదీ అరేబియాకు లభించాయి.

సూపర్ స్టార్ మెస్సీ సారథ్యంలో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా టైటిల్ నిలబెట్టుకుంటుందా? క్రిస్టియానో రొనాల్డోకు అందని ద్రాక్షగా ఉన్న ప్రపంచకప్‌ను పోర్చుగల్ అందిస్తుందా? నెమార్ తన మ్యాజిక్‌తో బ్రెజిల్‌కు పూర్వ వైభవం లభిస్తుందా? ఐదోసారి ప్రపంచకప్‌ను ముద్దాడి బ్రెజిల్ సరసన జర్మనీ నిలుస్తుందా? బ్రెజిల్, జర్మనీ, అర్జెంటీనా, ఫ్రాన్స్, ఉరుగ్వే, ఇంగ్లండ్, స్పెయిన్ కాకుండా కొత్త చాంపియన్‌ను ఈసారైనా చూస్తామా? వీటన్నింటికీ సమాధానం జూలై 19వ తేదీన లభిస్తుంది.

అరేబియాకు లభించాయి.

మెక్సికో మూడోసారి...

ప్రపంచకప్‌ను అత్యధికంగా మూడుసార్లు నిర్వహించిన దేశంగా మెక్సికో రికార్డు నెలకొల్పనుంది. గతంలో మెక్సికోలో 1970, 1986 ప్రపంచకప్ టోర్నీలు జరిగాయి. బ్రెజిల్ (1950, 2014), ఫ్రాన్స్ (1938, 1998), జర్మనీ (1974, 2006), ఇటలీ (1934, 1990) రెండుసార్లు చొప్పున ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించగా... తాజాగా ఈ జాబితాలో అమెరికా (1996, 2026) కూడా చేరనుంది.

బ్రెజిల్ మాత్రమే...

ఇప్పటి వరకు జరిగిన ప్రతి ప్రపంచకప్‌లోనూ ఆడిన ఏకైక జట్టుగా బ్రెజిల్ గుర్తింపు పొందింది. 2026 ప్రపంచకప్‌తో కలిపి బ్రెజిల్ వరుసగా 23వసారి ఈ మెగా ఈవెంట్‌లో ఆడనుంది. రెండో స్థానంలో జర్మనీ (21 సార్లు), మూడో స్థానంలో అర్జెంటీనా (19 సార్లు), నాలుగో స్థానంలో ఇటలీ, మెక్సికో (18 సార్లు చొప్పున), ఐదో స్థానంలో ఇంగ్లండ్, ఫ్రాన్స్, స్పెయిన్ (17 సార్లు చొప్పున), ఆరో స్థానంలో బెల్జియం, ఉరుగ్వే (15 సార్లు చొప్పున) ఉన్నాయి.

48 జట్లతో...

మొదటి ప్రపంచకప్‌లో 13 దేశాలు పాల్గొన్నాయి. 1978 వరకు 16 జట్లతో నిర్వహించారు. 1982 నుంచి 1994 ప్రపంచకప్‌లను 24 జట్లకు అవకాశం ఇచ్చారు. 1998 నుంచి 2022 వరకు 32 దేశాలు ప్రపంచకప్ కోసం పోటీపడ్డాయి. తాజా ప్రపంచకప్‌లో ఏకంగా 48 జట్లు బరిలో ఉండనున్నాయి. 39 రోజులపాటు జరిగే ఈ టోర్నీలో మొత్తం 104 మ్యాచ్‌లు జరుగుతాయి. అమెరికా అత్యధికంగా 78 మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తుంది. మెక్సికో, కెనడా దేశాల్లో 13 మ్యాచ్‌ల చొప్పున జరుగుతాయి. మ్యాచ్‌లు అమెరికాలోని 11 నగరాల్లో, మెక్సికోలోని 3 నగరాల్లో, కెనడాలోని 2 నగరాల్లో జరుగుతాయి.

నాకౌట్ దశకు 32 జట్లు

జట్ల సంఖ్య పెరగడంతో ఈసారి ఫార్మాట్ కూడా మారింది. మొత్తం 48 జట్లను 12 గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్లకు చోటు కల్పించారు. లీగ్ దశ ముగిశాక 12 గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లతోపాటు మూడో స్థానంలో నిలిచిన ఎనిమిది ఉత్తమ జట్లు నాకౌట్ దశకు (32 జట్లు) అర్హత సాధిస్తాయి. ఆ తర్వాత ప్రిక్వార్టర్ ఫైనల్స్ (16 జట్లు), క్వార్టర్ ఫైనల్స్ (8 జట్లు), సెమీఫైనల్స్ (4 జట్లు), ఫైనల్ (2 జట్లు) జరుగుతాయి. నాలుగుసార్లు చాంపియన్ ఇటలీ వరుసగా మూడోసారి ఈ మెగా ఈవెంట్‌కు అర్హత పొందడంలో విఫలం కాగా... కెప్ వెర్దె, కురసావ్, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ జట్లు తొలిసారి ప్రపంచకప్‌లో అరంగేట్రం చేయనున్నాయి.

నిద్ర మానేసి...

ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి గం. 9:30, 10:30 నుంచి; అర్ధరాత్రి గం. 12:30 నుంచి, గం. 1:30 నుంచి; తెల్లవారుజాము గం. 3:30 నుంచి, 4:30 నుంచి; ఉదయం గం. 6:30 నుంచి, గం. 7:30 నుంచి, గం. 9:30 నుంచి జరుగుతాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో అభిమానులు ప్రపంచకప్ మ్యాచ్‌లు తిలకించాలంటే రాత్రంతా నిద్ర మానేయాల్సి ఉంటుంది. భారత్‌లో మ్యాచ్‌లను 'జీ' స్పోర్ట్స్ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారం చేయున్నాయి.

ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్.. సింధు శుభారంభం

జకార్త: ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ పి.వి.సింధు శుభారంభం చేసింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆమె 2523, 2116తో బుసానన్ (థాయ్‌లాండ్)ను ఓడించింది. తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి సింధుకు గట్టిపోటీ ఎదురైంది. ఒక దశలో 2323తో స్కోర్లు సమమయ్యాయి. కానీ కీలక సమయంలో ఒత్తిడికి నిలుస్తూ రెండు పాయింట్లు దక్కించుకున్న సింధు తొలి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో సింధు దూకుడుగా ఆడింది. తేలిగ్గా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. రెండో రౌండ్లో ఆన్ సియాంగ్ (కొరియా)తో సింధు తలపడనుంది. గత తొమ్మిది మ్యాచ్‌ల్లో సియాంగ్‌పై భారత షట్లర్ గెలవలేదు. మరో మ్యాచ్‌లో మాళవిక బన్సోద్ 1221, 1021తో పోర్న్‌పావి (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ కథ తొలి రౌండ్లోనే ముగిసింది. లక్ష్యసేన్ 1921, 1621తో ఫర్హాన్ (ఇండోనేషియా) చేతిలో ఓడగా.. శ్రీకాంత్ 1921, 1521తో యుషి తనాక (జపాన్)కు తలొంచాడు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్‌ఎంఆర్ అర్జున్ జంట రెండో రౌండ్ చేరింది. తొలి రౌండ్లో ఈ జోడీ 2118, 2110తో నూర్ మహ్మద్‌టాన్ వీ (మలేసియా) జంటను ఓడించింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో పుల్లెల గాయత్రిట్రీసా జంట 1421, 1221తో కుసుమత్రియాస్ (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో ద్వయం 1121, 1021తో చెన్‌గువో గ్జిన్ (చైనా)కు తలొంచింది.

రేపు కేరళను తాకనున్న నైరుతి

వాతావరణశాఖ అంచనా

ఈకబురు, న్యూఢిల్లీ: భారత్‌లో పంటసాగుకు ప్రాణాధారమైన నైరుతి రుతుపవనాలు జూన్ నాలుగోతేదీన కేరళను తాకనున్నాయని భారత వాతావరణ శాఖ మంగళవారం ప్రకటించింది. సాధారణంగా జూన్-సెప్టెంబర్ సీజన్‌కు సంబంధించిన నైరుతి రుతుపవనాలు జూన్ ఒకటోతేదీ కల్లా కేరళలో చిరుజల్లులను కురిపిస్తూ రైతన్నల ముఖాల్లో ఆనందం తీసుకొస్తాయి. కానీ ఈసారి నాలుగు రోజులు ఆలస్యంగా భారత్‌లోకి అడుగుపెడుతున్నాయని వాతావరణశాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ''నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్ర, లక్షద్వీప్ దీవులు, కేరళలోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడులోలలో ఒకేసారి జూన్ నాలుగోతేదీన నైరుతి రుతుపవనాలు తాకే ఆస్కారముంది. నైరుతి, దక్షిణ మధ్య ప్రాంతం, తూర్పు మధ్యప్రాంతం, బంగళాఖాతం ఈశాన్య ప్రాంతాలు, బంగాళాఖాతంలోని ఆగ్నేయ ప్రాంతాల్లోనూ అదే తేదీన వర్షాకాల సీజన్ ఆరంభంకానుంది. ఈ ఏడాది వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ) 90 శాతంగా ఉండొచ్చు''అని వాతావరణ శాఖ అంచనావేసింది. గత 30 లేదా 50 సంవత్సరాల కాలంలో నిర్ణీత ప్రాంతంలో ఒక నెలలో లేదా ఒక సీజన్‌లో పడే వర్షపాతం సగటును ఎల్‌పీఏగా పేర్కొంటారు. 1971 నుంచి 2020 ఏడాది మధ్య నమోదైన ఎల్‌పీఏ 87 సెంటీమీటర్లనే ప్రస్తుతం ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈసారి ఎల్‌పీఏ 90 శాతంగా ఉండొచ్చు అంటే ఈసీజన్‌లో లోటు వర్షపాతం నమోదయ్యే ఆస్కారముందని వాతావరణ శాఖ నిపుణులు అంచనావేస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగానే లోటు వర్షపాతం ముప్పు పొంచి ఉందని నిపుణులు వివరించారు. భూమధ్యరేఖ సమీప పసిఫిక్ మహాసముద్ర ప్రాంత ఉపరితల జలాలు క్రమంగా వేడెక్కుతూ ఎల్‌నినో పరిస్థితులను సృష్టిస్తున్నాయి. జూన్‌లో ఎల్-నినో ప్రభావం తక్కువగా ఉండి, సెప్టెంబర్‌లో బలపడే అవకాశముంది.